రుద్రూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడికి డీఐఈవో అభినందన

శ్రీనివాస్ రాజుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఐఈవో రవికుమార్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 15 : మారుతున్న సమాజానికి అనుగుణంగా డిజిటల్ విధానాన్ని ఉపయోగించి విద్యాబోధన చేసినందుకు రుద్రూర్ ఆదర్శ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ శ్రీనివాస్ రాజును జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవికుమార్ సోమవారం అభినందించారు. ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన సిలబస్‌ను టీ-శాట్ ద్వారా విద్యాబోధన చేసినందుకు తెలంగాణ ఇంటర్మీడియెట్ వారు పంపిన ప్రశంసా పత్రాన్ని శ్రీనివాసరాజుకు అందజేసి అభినందించారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు

సిరికొండ, ఏప్రిల్ 15 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బాలయ్యగౌడ్ ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. బాలయ్యకు మతిస్థిమితం సరిగ్గా లేదని, అతనికి కుటుంబీకులు కూడా లేరని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం రాత్రి కొండాపూర్ గ్రామ సమీపంలోని చెరువు గట్టపై నిద్రిస్తుండగా ఆయనపై ఎలుగుబంటి దాడి చేసినట్లు చెప్పారు. అరుపులు, కేకలకు ఎలుగుబంటి అక్కచి నుంచి పరారైందని తెలిపారు. గాయపడిన బాలయ్యగౌడ్‌ను కామారెడ్డి దవాఖానకు తరలించారు.

పీఎంపీలపై దాడులు ఆపాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 15 : రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధికారులు పీఎంపీలపై చేస్తున్న దాడులను ఆపాలని తెలంగాణ పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాయిబాబా, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రాజు కోరారు. జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాలయంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఐఎంఏ సభ్యులు ఆరోపణలు చేయడంతో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధికారులు ప్రథమ చికిత్సాలయాలపై దాడులు చేసి, సీజ్ చేయిస్తున్నారని ఆరోపించారు. ఒకరిద్దరు పీఎంపీలు చేసిన తప్పులకు మొత్తం వ్యవస్థను తప్పుపట్టడం సరికాదన్నారు. దీనిపై త్వరలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతోపాటు సీఎం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సత్యపాల్, రాష్ట్ర కోశాధికారి సాంబశివరావు, జిల్లా కోశాధికారి భోజన్న పాల్గొన్నారు.

23న వీర హనుమాన్ విజయయాత్ర

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 23న విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలి

సమావేశానికి హాజరైన అధికారులు, మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

అధికారులకు అదనపు కలెక్టర్ అంకిత్ సూచన

కంఠేశ్వర్, ఏప్రిల్ 15 : జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమాజానికి పెనుసవాలుగా మారిన మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు నిఘా ఉంచాలని అన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలపై ఆరాతీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శన్, వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, అటవీ, రవాణా, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారుల ఇండ్లలో సోదాలు

కమ్మర్‌పల్లి/ భీమ్‌గల్/మోర్తాడ్/రుద్రూర్/ వర్ని, ఏప్రిల్ 15: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఇండ్లలో సోమవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యాపార సంబంధిత పత్రాలు పరిశీలించినట్లు సమాచారం. ఫైనాన్స్ వ్యాపారుల ఇండ్లపై దాడిచేసి ముగ్గురు వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంతోపాటు బెజ్జోరాలో ముగ్గురు వ్యక్తుల ఇండ్లలో సోదాలు చేసి సంబంధిత పత్రాలు, చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు బృందాలుగా ఏర్పడి దాడులు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మోర్తాడ్‌లో రమేశ్ అనే వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. అధికంగా వడ్డీ వసూలు చేయడం, అప్పు తీసుకున్న వారిని ఇబ్బందులు పెడుతుండడంతో వడ్డీ వ్యాపారుల ఇండ్లలో పోలీసులు సోదాలు చేసినట్లు తెలిసింది. తనఖా పెట్టిన వాటికి సంబంధించిన పత్రాలు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

రుద్రూర్, వర్ని మండల మండల కేంద్రాల్లో వడ్డీ వ్యాపారుల ఇండ్లు, పలు ఫైనాన్స్‌లపై పోలీసులు సోదాలు చేశారు. అధికంగా వడ్డీ వసూలు చేస్తున్న వారి నుంచి ప్రామిసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సైలు అప్పారావు, కృష్ణకుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

చందూర్, ఏప్రిల్ 15 : మండల కేంద్రానికి చెందిన మమ్మాయి రవి (46) ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మమ్మాయి రవి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని, అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్

సారంగాపూర్, ఏప్రిల్ 15 : నగర శివారులోని సారంగాపూర్‌లో ఉన్న బీఈడీ కళాశాలలో ఆరో టౌన్ ఎస్సై రమేశ్ సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలు, సైబర్‌నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు వాడడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వన్నెల్‌దాస్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్, అధ్యాపకులు పోలపల్లి సువర్చల, శ్రీకాంత్, హరిత, నరేందర్, పోశెట్టి, నర్సింహారెడ్డి, నుస్రత్, ప్రసాద్, శశి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మందిపై కేసు

- ఇద్దరికి రెండు రోజుల జైలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 15 : ట్రాఫిక్ పోలీసులు జిల్లా కేంద్రంలో ఇటీవల చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 27 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. కోర్టులో నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట సోమవారం వారిని హాజరు పర్చగా.. 25 మంది వాహనదారులకు రూ.24,100 జరిమానా విధించారు. మరో ఇద్దరు నరేశ్ నాయక్ దేగావత్, మాదాసు సంతోష్‌గౌడ్‌కు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వెల్లడించారు.

పద్మశాలీలు మద్దతు ఇవ్వాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 15 : ఎంపీ ఎన్నికల్లో పద్మశాలీ కులస్తులు తనకు మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. జిల్లాకేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో ఆయన సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖిల భారత భక్త మార్కండేయ పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్‌ను పద్మశాలీ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాద్రి, పట్టణ అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి ప్రారంభంకానున్న ఉచిత శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, మగ్గంవర్క్, టైలరింగ్‌పై 30 రోజుల శిక్షణ ఇస్తామని, అర్హులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితంగా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461-295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలతో ప్రతిఒక్కరికీ న్యాయం

సిరికొండ, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని, వాటితో ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ కార్యకర్తలతో సోమవారం సమావేశమై మాట్లాడారు. నాలుగు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నదని, రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రూరల్, బోధన్ ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర సభ్యుడు నగేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జిల్లాకార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విండో సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కోటగిరి, ఏప్రిల్ 15 : కోటగిరి వ్యవసాయ సహకార సంఘ సభ్యులు మొత్తిపేట నడిపి రాజయ్య, ఆకుల హన్మాండ్లు ఇటీవల మృతిచెందగా.. సొసైటీ ద్వారా రూ. 5 వేల చొప్పున బాధిత కుటుంబాలకు చైర్మన్ కూచి సిద్దు సోమవారం అందజేశారు. సొసైటీలో సభ్యత్వం ఉండి మృతిచెందితే అంత్యక్రియల నిర్వహణ కోసం బాధిత కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున అందజేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గాండ్ల వీరేశం, సీఈవో విఠల్, నారాయణ ఎల్లుట్ల గజేందర్ , రాజయ్య, నాగేశం, పత్తి సురేశ్ పాల్గొన్నారు.

ఎనుగందుల శంకర్‌కు ఉగాది పురస్కారం

పురస్కారాన్ని అందుకుంటున్న ఎనుగందుల శంకర్

ఇందల్వాయి, ఏప్రిల్ 15 : ఇందల్వాయి పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఎనుగందుల శంకర్‌కు ఉగాది పురస్కారం లభించింది. జిల్లాకేంద్రంలోని విశ్వోదయ టెక్నో స్కూల్‌లో స్వర్ణ లక్ష్మణ్‌రావు స్మారక సాహితీ సంస్థ - నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాన్ని ఎనుగందుల శంకర్‌కు అందజేశారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరయ్య చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు కరపత్రాలు అందిస్తూ సోమవారం ఫైర్ స్టేషన్ అధికారి మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, పెర్కిట్ చౌరస్తాలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించామని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 101 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

మిషన్ భగీరథ ఉద్యోగిపై డీఈకి ఫిర్యాదు



డీఈ మున్నీ నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న పోచారం గ్రామస్తులు

బోధన్, ఏప్రిల్ 15: పోచారం గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై గ్రామస్తులు సోమవారం బోధన్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో డీఈ మున్నీనాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విధులు సక్రమంగా నిర్వహించకుండా సదరు ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బండి రావడం లేదని రోడ్డుపైనే చెత్త వేశారు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలోని 36వ వార్డులో మూడు రోజుల నుంచి చెత్తబండి రాకపోవడంతో కాలనీవాసులు సోమవారం రోడ్డు పైనే చెత్తను వేశారు. చెత్తబండి రావడం లేదని స్థానిక కౌన్సిలర్ రమేశ్‌కు సమాచారం అందించామని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. చెత్తబండ్లు చెడిపోయాయంటూ సిబ్బంది మాట దాటవేస్తున్నారని కాలనీవాసులు తెలిపారు.

'కూలీల సమస్యలు పరిష్కరించాలి'

నందిపేట్, ఏప్రిల్ 15: సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఉపాధిహామీ కూలీలు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2005లో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ చట్టంలో కార్మికులకు కొన్ని హక్కులు కల్పించారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని, కూలి డబ్బులు సకాలంలో అందజేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలో సోమవంశీయ సహస్రార్జున క్షత్రియ యువజన సంఘం ఎన్నికలు ఆదివారం రాత్రి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా నీరజ్ ఎన్నికయ్యారు. వారిని యువజన సంఘ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజు, సచిన్, రాహుల్, సాయి, పోహర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 15: మండలంలో సోమవారం ఓటరు విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువత, ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజా శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ సరిత, ఆర్ఐ శరత్, ఎంఈవో ఆంధ్రయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

జాగిర్యాల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్, ఏప్రిల్ 15: కమ్మర్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరాను సోమవారం ఎంపీడీవో రాజా శ్రీనివాస్ పరిశీలించారు. కమ్మర్‌పల్లి, నాగపూర్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల ప్రగతిని సమీక్షించారు. నాగపూర్ పాఠశాలలో టాయిలెట్స్ పనిని వీవో, హెడ్మాస్టర్ల ద్వారా తాపీ మేస్త్రీకి చూపించి పలు సూచనలు చేశారు. భీమ్‌గల్ మండలంలోని బెజ్జోరా, పురాణిపేట్, జాగిర్యాల్, దేవన్‌పల్లి గ్రామాల్లోని జడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ఎంపీడీవో సంతోష్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలను పరిశీలించారు. అవసరమైన మరమ్మలు చేయాలని హెచ్ఎంలు, మహిళా సంఘాల వీవోలకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో స్వామి, ఏఈ మేఘన, ఏపీఎం రవీందర్, సీసీలు శ్రీనివాస్, నరేశ్, హెచ్ఎంలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీకి వడదెబ్బ

నవీపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలో లింగం గుట్ట సమీపంలోని ఓ చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తుండగా కూలీ ఆర్.లావణ్య సోమవారం వడదెబ్బకు గురై స్పృహ తప్పి పడిపోయినట్లు టెక్నికల్ అసిస్టెంట్ సాగర్ తెలిపారు. నవీపేటకు చెందిన లావణ్య 15 రోజులుగా ఉపాధిహామీ పనుల నిమిత్తం లింగం గుట్ట కుంటకు వెళ్తోంది. సోమవారం సైతం పనులకు వెళ్లింది. ఎండ వేడికి తట్టుకోలేక ఆకస్మాత్తుగా కింద పడి పోయింది. వెంటనే చికిత్స నిమిత్తం ఈజీఎస్ సిబ్బంది దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి

జలీనా(ఫైల్)

నవీపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న జరీనా(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. జరీనాకు రెండు రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో స్థానిక ఉపాధ్యాయులు నిజామాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆమె మృతికి తోటి ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

కానిస్టేబుల్ వీరంగం

- మద్యం మత్తులో హల్‌చల్
- తన బైక్‌తో కారును ఢీకొట్టిన పోలీసు
- పైగా కారు ఓనర్‌నే దబాయించిన వైనం
- సీపీ కార్యాలయం ఎదుటే ఘటన
- ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 15: మద్యం మత్తులో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ అర్ధరాత్రి వీరంగం సృష్టించాడు. తనే ఢీకొట్టి ఉల్టా కారు యజమానిపై దబాయింపులకు దిగాడు. సాక్షాత్తు పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుటే ఈ ఘటన చోటుచేసుకోగా, పోలీసులు సదరు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు కథనం ప్రకారం.. నిజామాబాద్ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హైమద్ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తన బైక్‌పై వెళ్తున్నాడు. సీపీ కార్యాలయం వద్దకు రాగానే తన ముందున్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. కారులో ఉన్న వారు దిగి ఎందుకు ఢీకొట్టావని ప్రశ్నించగా ఎదురు తిరిగాడు. తాను కానిస్టేబుల్‌ను అని, ఆర్‌సీ ఉందా అని అడిగి బలవంతంగా లాక్కున్నాడు. ఇదెక్కడి దౌర్జన్యం అని కారులో ఉన్న మహిళలు ప్రశ్నించగా, వారిని కూడా దబాయించాడు. మిగతా వాహనదారులు జరుగుతున్నదంతా చూస్తూ అలాగే ఉండిపోయారు. అదే సమయంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళ్తుండగా.. సీపీ ఆఫీసు ఎదుట జనం గుమిగూడి ఉండడం చూసి ఆగారు. సీఐని చూసిన బాధితులు ధైర్యం తెచ్చుకుని జరిగిందంతా చెప్పారు. ఏఆర్ కానిస్టేబుల్‌ను ఠాణాకు తరలించిన ఎస్‌హెచ్‌వో.. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయించగా మద్యం తాగినట్లు తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరచనున్నట్లు విజయ్‌బాబు తెలిపారు.

అప్పు చెల్లించుమన్నందుకు హతమార్చారు

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితులైన భార్యాభర్తల రిమాండ్

నవీపేట, ఏప్రిల్ 15: రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన చంద్రకళ హత్య కేసులో అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు పార్దె గంగాధర్(పొట్టోడు) అతని భార్య గోదావరిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, స్థానిక ఎస్సై యాదగిరిగౌడ్ విలేకరులకు వెల్లడించారు. వారి కథనం మేరకు.. బోర్గాం గ్రామానికి చెందిన చంద్రకళ వద్ద పార్దె గంగాధర్ అతని భార్య గోదావరి అప్పు తీసుకున్నారు. కొన్నేండ్లుగా గోదావరి అనారోగ్యంతో బాధ పడుతోంది. చంద్రకళ మంత్రాలు చేయడంతోనే గోదావరి అనారోగ్యానికి గురైందని పలుమార్లు నిందితులు ఆరోపించారు. ఈ నేపథ్యంతో అప్పు చెల్లించాలని చంద్రకళ ఒత్తిడి చేసింది. ఎలాగైనా చంద్రకళను హతమార్చాలని గంగాధర్, అతని భార్య గోదావరి పథకం పన్నారు. ఈ నెల 10న అప్పు చెల్లిస్తామని చెప్పి చంద్రకళను ఇంటికి పిలిచి గొడ్డలితో తలపై బాది హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని గోనెసంచిలో వేసుకొని వెళ్లి కాల్వలో పడేశారు. వారం రోజులుగా ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ ట్రైనీ ఐపీఎస్ శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి స్థాయిలో పరిశోధన చేసి కేసును ఛేదించినట్లు సీఐ చెప్పారు. హత్య చేసిన అనంతరం చంద్రకళ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను నిందితులు తీసుకోగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

బాల్కొండ, ఏప్రిల్ 15: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీలో భాగంగా ఊర చెరువు పూడికతీత పనులను ఏపీఎం ఇందిర తనిఖీ చేశారు. మస్టర్‌లో హాజరును పరిశీలించారు. కూలీలకు కూలీ 300 వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. కూలీలు వడదెబ్బకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఫ్ఏ, జేపీఎస్‌లకు సూచించారు. ఆమెవెంట టీఏ ధనుంజయ్, జేపీఎస్ మహేశ్, ఎఫ్ఏ అనిల్, మేట్లు ఉన్నారు.

టిప్పర్ యజమానికి జరిమానా

నవీపేట, ఏప్రిల్ 15: ధర్మాపూర్ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ యజమానికి అధికారులు రూ. 20 వేల జరిమానా విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. వారం క్రితం మల్కాపూర్‌కు చెందిన మొరం మాఫియా రాత్రివేళలో మొరం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకుని మైన్స్ అధికారులకు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం..

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్15: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ నాయకులతో ఆపార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సోమవారం సమావేశం నిర్వహించారు. కార్య